సాక్షి కామారెడ్డి

శనివారం । 11 । నవంబర్ । 2023



విచ్చలవిడిగా వాడొద్దు

రైతులు పంటలపై విచ్చలవిడిగా పురుగుల మందులు వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్త సునీత సూచించారు.

- IIIలో ▸



ఓటు వజ్రాయుధం

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు పలు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.5 /18.4

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండ తీక్షణంగా కాస్తుంది. రాత్రి మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పోలీస్ అబ్జర్వర్ రాక



కామారెడ్డి క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఉదయం కామారెడ్డికి వచ్చారు. ఆయనకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాష్, ఎస్‌బీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలోని రూం నంబర్ 1లో అందుబాటులో ఉంటానని, ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. 87126 86095 నంబర్‌కు సమాచారం ఇచ్చినా స్పందిస్తామన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: స్టేట్ టీచర్స్ యూనియన్(టీఎస్) కామారెడ్డి జిల్లా శాఖను శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జే.హన్మంతురెడ్డి(ఎల్లారెడ్డి), ప్రధాన కార్యదర్శిగా కే.రాములు(నిజాంసాగర్), ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ ఖలీమొద్దీన్(కామారెడ్డి) రాష్ట్ర కౌన్సిలర్‌గా కందుకూరి దయానంద్(మాచారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

- నామినేషన్ కేంద్రం సమీపానికి వందలాది మంది..
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘించారు. నిబంధనల మేరకు నామినేషన్ కేంద్రంలోనికి అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే అనుమతించాలి. కానీ శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో చాలామంది రిటర్నింగ్ అధికారి కార్యాలయం గేటు లోపలికి వచ్చారు. వందలాది మంది కాంగ్రెస్ నాయకులు నామినేషన్ కేంద్రానికి సమీపంలోనే గుమిగూడారు. అక్కడే ఉన్న అధికారులు, పోలీసులు వారిని అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించారు. పోలీసులు కొంత సేపటి తర్వాత వారిని నామినేషన్ కేంద్రం నుంచి బయటికి పంపించారు.



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కామారెడ్డిలో ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, కార్యకర్తలు

మీ చేతిలోనే రాష్ట్ర భవిత

- కామారెడ్డి భూముల మీద కన్నేసిండ్రు
- నమ్మితే నిండా ముంచుతరు జాగ్రత్త...
- కేసీఆర్‌ను ఓడించేందుకే ఇక్కడికి వచ్చిన
- బీసీ డిక్లరేషన్ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: ''తెలంగాణ ప్రజల భవిష్యత్తు మీ చేతిలోనే ఉంది. యావత్ రాష్ట్రమే కాదు దేశ, విదేశాల్లో ఉన్న మనోళ్లందరూ మీ తీర్పు గురించే ఆసక్తిగా చూస్తున్నరు. గజ్వేల్‌ను మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌ల ముంచిండ్రు. ఇప్పుడు కామారెడ్డి భూముల మీద కన్నేసిండ్రు. గజ్వేల్‌ను ఆగంజేసినోళ్లు కామారెడ్డిని బంగారు తునక జేస్తరంటే నమ్ముతరా.. నమ్మితే మోసపోవుడే. మీ అండతో కేసీఆర్‌ను ఓడించి తీరుతా'' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో నామినేషన్ వేసిన అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో పాల్గొన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ బీసీ డిక్లరేషన్‌ను ప్రవేశపెట్టగా.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడారు. సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే సీఎం కేసీఆర్ వాళ్లకు చేసిందేమీ లేకపోగా, వాళ్ల భూములను మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లో ముంచి నిర్వాసితులను చేశాడన్నారు. అక్కడ ముఖం చెల్లక కామారెడ్డికి వస్తున్నాడన్నారు. సిద్దిపేట, సిరిసిల్లకు కాకుండా కామారెడ్డికి రావడం వెనుక మతలబు ఉందన్నారు. సీఎం ఇక్కడి సారవంతమైన భూముల మీద కన్నేశారన్నారు. మాస్టర్ ప్లాన్ పేరుతో నిండా ముంచే ప్రయత్నం చేయగా రైతులు పోరాడడంతో ఆపివేశారని, ఇప్పుడు తండ్రీకొడుకులు మాయమాటలు చెబుతూ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గజ్వేల్‌లో నిజంగా మంచి చేసి ఉంటే అక్కడే పోటీ చేసేవాడన్నారు. ప్రజల్ని వంచించిన కేసీఆర్‌ను ఓడించేందుకే తాను కామారెడ్డిలో పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం, పౌరుషం, త్యాగానికి ప్రతీక అయిన కామారెడ్డి ప్రజలు కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కామారెడ్డి ప్రాంతంతో రక్త బంధుత్వం కలుపుతున్న కేసీఆర్.. రైతులు చనిపోతే ఏనాడూ వచ్చిన పాపాన పోలేదన్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిని జేస్తే లక్ష కోట్లు దోచుకున్నాడని, వెయ్యి ఎకరాల ఫాం హౌజ్‌లు నిర్మించుకున్నాడని ఆరోపించారు. మూడోసారి అంటే మనవడిని కూడా తీసుకువస్తాడేమోనన్నారు.

ఏం ముఖం పెట్టుకుని వచ్చిండు

కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను ఆరునెలల్లో పూర్తి చేస్తానని చెప్పి తొమ్మిదిన్నరేళ్లయినా పూర్తి చేయని సీఎం కేసీఆర్ ఏం ముఖం పెట్టుకుని కామారెడ్డికి వచ్చాడని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ప్రశ్నించారు. తాను మంత్రిగా పనిచేసిన సమయంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత -చేవెళ్ల పథకానికి కామారెడ్డిలో శంకుస్థాపన చేశారన్నారు. ప్రాజెక్టు పేరును కాళేశ్వరంగా మార్చిన సీఎం కేసీఆర్ ఆరు నెలల్లో పనులను పూర్తి చేస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే పనులను పూర్తి చేసి సాగునీరందిస్తామన్నారు.



సభలో అభివాదం చేస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

బీసీ డిక్లరేషన్ సభకు వేలాది మంది తరలివచ్చారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రసంగానికి శ్రేణులు అయ్యారు. సీఎం కేసీఆర్‌పై విమర్శలు చెసినప్పుడు కార్యకర్తలు ఈలలు, చప్పట్లతో ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కామారెడ్డిలో సీఎం చేసిన ప్రసంగంలో రేవంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు, విమర్శలను రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర నాయకుడు చాడా వెంకటరెడ్డి, తెలంగాణ జన సమితి నేతలు ప్రొఫెసర్ కోదండరాం, నిజ్జన రమేశ్, కాంగ్రెస్ నేతలు సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, మధుయాష్కీగౌడ్, ఆది శ్రీనివాస్, శారద, అనిల్, ఆకుల లలిత, మానాల మోహన్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌రావు, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి, గణేశ్‌నాయక్, పండ్ల రాజు, చందు, గడ్డం ఇందుప్రియ, చంద్రశేఖర్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పర్యటన సాగిందిలా..

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి శుక్రవారం హెలీకాప్టర్ ద్వారా కామారెడ్డికి చేరుకుని, మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇంటికి వెళ్లారు. భోజనానంతరం పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతోపాటు పలువురు నేతలతో కలిసి షబ్బీర్‌అలీ ఇంటి నుంచి పాతబస్టాండ్, స్టేషన్‌రోడ్డు, రైల్వే కమాన్ మీదుగా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంతరం ర్యాలీగా ఇందిరాగాంధీ స్టేడియానికి చేరుకున్నారు.

బీసీ నాయకుల నిరసన

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ సభా ప్రాంగణంలో బీసీ నాయకులు నిరసన తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజు, పటాన్‌చెరుకు చెందిన నీలం మధుల అనుచరులు ఒక్కసారిగా ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. ప్రెస్ గ్యాలరీలోకి 20 మందికిపైగా నాయకులు వచ్చి 15 నిమిషాల పాటు ఆందోళన చేశారు. బీసీలకు అన్యాయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఎస్సై సంతోష్‌గౌడ్ వచ్చి నిరసనకారుల వద్ద నుంచి ప్లకార్డులను లాక్కుని బయటకు పంపించారు.



సభలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు



రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న బల్దియా వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ,



షబ్బీర్ అలీతో రేవంత్ ముచ్చట్లు



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, వేదికపై నాయకులు మాణిక్‌రావ్ ఠాక్రే, షబ్బీర్ అలీ, సీపీఐ నేతలు నారాయణ, వెంకట్‌రెడ్డి, టీజేఎస్ నేత ప్రొఫెసర్ కోదండరాం

జోరుగా నామినేషన్లు

- 135 మంది అభ్యర్థులు.. 215 సెట్లు దాఖలు
- ముగిసిన నామినేషన్ల పర్వం

కామారెడ్డి క్రైం/మద్నూర్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం ఒక్కరోజే 112 నామినేషన్లు వచ్చాయి. అత్యధికంగా కామారెడ్డిలో 45 నామినేషన్లు దాఖలు కాగా.. ఎల్లారెడ్డిలో 27, జుక్కల్‌లో 23, బాన్సువాడలో 17 నామినేషన్లు వేశారు.

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 135 మంది అభ్యర్థులు 215 సెట్ల నామినేషన్లు సమర్పించారు. కామారెడ్డి నియోజకవర్గంలో 74 మంది అభ్యర్థులు కలిపి 103 సెట్ల నామినేషన్లు వేయగా.. ఎల్లారెడ్డిలో 16 మంది 27 సెట్లు, జుక్కల్‌లో 28 మంది 50 సెట్లు, బాన్సువాడలో 17 మంది 35 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 13న నామినేషన్లను పరిశీలించనున్నారు. 15వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తారు.



కామారెడ్డిలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో కలిసి నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి



ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్..



ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్





మద్నూర్‌లో నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే.. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావ్



బాన్సువాడలో కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌రెడ్డి

'అధికారులు సమన్వయంతో పనిచేయాలి'

కామారెడ్డి క్రైం: అధికారులు సమన్వయంతో ఎన్నికల విధులను నిర్వహించాలని కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల సాధారణ పరిశీలకుడు ఆర్డర్ వర్చుయో సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇతర ఎన్నికల పరిశీలకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ విభాగాలకు ఏర్పాటు చేసిన నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అభ్యర్థుల ఖర్చులను పర్యవేక్షించడం కీలకమన్నారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు.

జిల్లాలో 6,61,163 మంది ఓటర్లు..

జిల్లా ఎన్నికల విభాగం పరిధిలోని మూడు నియోజకవర్గాలలో 6,61,163 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. 791 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మహిళలు, యువత కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. పోలింగ్ బూత్ వారీగా రూట్ మ్యాప్ రూపొందించి, సెక్టోరల్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించామని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగు ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం పరిశీలకులు అధికారులతో కలిసి కంట్రోల్ రూమ్‌ను, ఆ తర్వాత అనంతరం పోలీస్ కార్యాలయ సమీపంలోని కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సాధారణ పరిశీలకుడు జగదీష, పోలీస్ పరిశీలకుడు అబ్దుల్ ఖయ్యూం, వ్యయ పరిశీలకుడు పరా శివమూర్తి, ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, నోడల్ అధికారులు కిషన్, సింహారావు, సురేందర్ కుమార్, సతీష్ కుమార్, రాజారామ్, శాంతి కుమార్, రఘునాథ్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పరిశీలకులు

కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

- కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- బీజేపీని గెలిపించాలని పిలుపు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా, బీజేపీ నాయకులు

బాన్సువాడ: తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా పేర్కొన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ వస్తే నిధులు, నీళ్లు, నియామకాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావించిందని, వారికి నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీతో నిరుద్యోగ యువత భవిష్యత్ నాశనమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా పేర్లు మార్చి స్వార్థ రాజకీయాలకు కేసీఆర్ తెరలేపారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లను చూపిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేదల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి ప్రకటించారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిచి, ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని పేర్కొన్నారు. బాన్సువాడ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొరబాబు, సుగుణ, శ్రీనివాస్, అర్షపల్లి సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, చిదరి సాయిలు, భూపాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, గంగాధర్, కొండని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకాంక్షకు ఆర్థికసాయం

డొంకేశ్వర్: గుండె సంబంధిత చికిత్సను పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన చిన్నారి ఆకాంక్షకు తొండాకూర్ ఎస్ఎస్‌వీ పాఠశాల యాజమాన్యం ఆర్థికసాయాన్ని అందజేసింది. ఈ మేరకు విద్యార్థులు సేకరించిన రూ.40వేల నగదును ఆకాంక్ష కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి, హెడ్‌మాస్టర్ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకడమే లక్ష్యం



బాన్సువాడ: తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించడమే తమ లక్ష్యమని బాన్సువాడ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలో నామినేషన్ వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తనకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా చేసిన అనుభవం ఉండడంతో బాన్సువాడలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం తనను ఇక్కడికి పంపిందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, కాంగ్రెస్‌ను మోసం చేసిన కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలని అన్నారు. రామారావు మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. నాయకులు ప్రతాప్‌సింగ్, నందురెడ్డి, కూనిపూర్ రాజిరెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి ఉన్నారు.

స్థిరాస్తులు.. చరాస్తులు

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆయా పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో పాటు స్థిర, చర ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో శుక్రవారం పొందుపర్చారు. పొందుపర్చిన పత్రాల్లో అభ్యర్థి, కుటుంబ సభ్యులపై ఉన్న స్థిర, చర ఆస్తులు, నగదు, బంగారం, పలు వివరాలు ఉన్నాయి. – సాక్షి, నెట్‌వర్క్

ఆశన్నగారి జీవన్‌రెడ్డి (బీఆర్ఎస్ ఆర్మూర్ అభ్యర్థి)



భార్య: రజితరెడ్డి
కుమార్తెలు: అనొషికరెడ్డి, అనన్యరెడ్డి
చేతిలో ఉన్న నగదు: రూ. ఒక లక్ష 98 వేలు
భార్య చేతిలో: రూ.ఒక లక్ష 78 వేలు
కుమార్తెల చేతుల్లో: రూ.లక్షామూడు వేలు
బ్యాంక్ బ్యాలెన్స్: రూ. 1,64,599
భార్య ఖాతాలో: రూ. 2,11,469
కుమార్తెల ఖాతాల్లో: రూ. 4,03,323
బంగారం, వెండి(రూ.లలో): 64,87,160 (నలుగురివి)
రుణాలు: రూ. 41,65,97,499
అన్‌సెక్యూర్డ్ లోన్: రూ.11లక్షలు
వ్యవసాయ భూములు: తొర్లికొండ, ఆర్మూర్‌లో..
నివాసాలు: బంజారాహిల్స్, ఆర్మూర్
స్థిరాస్తులు: రూ. 11 కోట్లు
వాహనాలు: ఫోర్డ్ ఎండీవర్ కారు
ఎలక్ట్రానిక్ వస్తువులు: రూ.12లక్షలు
రజితరెడ్డి వద్ద: రూ.14లక్షల60 వేలు (గృహోపకరణాలు)

వినయ్‌రెడ్డి (కాంగ్రెస్ ఆర్మూర్ అభ్యర్థి)



భార్య: అనన్యరెడ్డి
కుమారుడు: హృదయ్‌రెడ్డి
కుమార్తె: అన్విరెడ్డి
స్థిర, చరాస్తులు: రూ.1,14,60,247
భార్యపై: రూ.1,01,44,584
కుమారుడిపై: రూ.2,67,050
కుమార్తెపై: రూ.3లక్షలు

పైడి రాకేశ్ (బీజేపీ ఆర్మూర్ అభ్యర్థి)



భార్య: రేవతిరెడ్డి
కుమారుడు: రేయాన్ష్ రెడ్డి
చరాస్తులు: రూ.6,80,36,354,
భార్యపై: రూ.1,67,69,557,
కుమారుడిపై: రూ.35,78,321,
వ్యక్తిగత ఆస్తులు: రూ.5,70,15,264
భార్యపై: రూ.3,50,73,194
రుణాలు: రూ.8,44,35,000
భార్యపై: రూ.27లక్షలు
వ్యవసాయ, వ్యవసాయేతర: రూ.37,64,024
భార్యపై: రూ.21,47,050

ఏలేటి అన్నపూర్ణమ్మ (బీజేపీ బాల్కొండ అభ్యర్థి)



బ్యాంకు బ్యాలెన్స్,
బంగారం: రూ.29,40,246
వ్యవసాయ భూమి: 8ఎకరాల03 గుంటలు (రూ.80లక్షలు)
నివాసాలు: చౌట్‌పల్లి, హైదరాబాద్
క్రిమినల్ కేసులు: ఎన్నికల కేసు నమోదు

బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి)



భార్య: వినోద
స్థిరాస్తులు: రూ.2కోట్ల85లక్షలు
చరాస్తులు: రూ.77లక్షల77వేలు
భార్యపై స్థిరాస్తులు: రూ.35లక్షల50వేలు
చరాస్తులు: రూ.13,04,647
చేతి నగదు: రూ.49వేలు
భార్యపై: రూ.40,600
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.41,28,070
భార్యపై: రూ.1,01,047
వాహనాలు: ఒక జీప్ రాంగ్లర్
బంగారం: 30 తులాలు
కేసులు: లేవు

బిగాల గణేశ్ గుప్తా (బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి)



భార్య: లత బిగాల
బ్యాంక్ బ్యాలెన్స్: రూ. 1,90,500
భార్యపై: రూ. 1,50,000
బంగారం(రూ.లలో): రూ. 2కోట్ల14లక్షలు
వ్యవసాయ భూమి: ఉంది
నాన్ అగ్రికల్చరల్: రంగారెడ్డి,సంగారెడ్డి, నిజామాబాద్ శివారులో..
స్వంత భవనం: ఉంది
అప్పులు: రూ.4,01,92,762
భార్యపై ఉన్న అప్పులు: రూ. 2కోట్ల42లక్షలు
వాహనాలు: నాలుగు కార్లు
కేసులు: లేవు

మహమ్మద్ షబ్బీర్‌అలీ (కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి)



భార్య: నఫీజ్ పర్వీన్
చేతిలో నగదు: రూ. 75 వేలు
భార్య చేతిలో: రూ. 50 వేలు
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.85 లక్షలు
భార్యపై: రూ.1.29 కోట్లు
బంగారం: 477 గ్రాములు
వ్యవసాయ ఇంటి స్థలం: ఉన్నాయి
అప్పులు: లేవు
వాహనాలు: మూడు కార్లు
కేసులు: హైదరాబాద్ పంజాగుట్టలో ఒకటి

పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్ బోధన్ అభ్యర్థి)



భార్య: సుచరిత
చేతిలో ఉన్న నగదు: రూ4లక్షల99 వేలు
భార్య చేతిలో: 10లక్షల73 వేలు
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.1,27,89,394
భార్య ఖాతాలో: రూ. 1,34,78,564
బంగారం (రూ.లలో): రూ. 1,43,64,000
అప్పులు: రూ. 14,89,63,984,
భార్యపై ఉన్న అప్పులు: రూ.15కోట్ల38లక్షల20 వేలు
వ్యవసాయ భూములు: 35 ఎకరాలు (భార్య,భర్తలది కలిపి)
నివాసాలు: జూబ్లీహిల్స్, నిజామాబాద్‌లోని కంఠేశ్వర్‌లో..
చరాస్తులు: రూ. 28,83,84,743
భార్యపై..: రూ.38,92,15,894
స్థిరాస్తులు: రూ. 4,70,22,187
భార్యపై..: రూ.37,51,55,400
వాహనాలు: లేవు.

మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్ బోధన్ అభ్యర్థి)



భార్య: అయేషా ఫాతిమా
చేతిలో ఉన్న నగదు: రూ.3,68,860
భార్య చేతిలో: రూ.88,500
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.16,66,24,454
భార్య ఖాతాలో: రూ.2,06,11,416
అప్పులు: రూ.13,65,02,241
భార్యపై ఉన్న అప్పులు: రూ.2,07,15,712
వ్యవసాయ భూములు: 9 ఎకరాల 25 గుంటల (భార్యపై)
నివాసాలు: జూబ్లీహిల్స్,బోధన్‌లో..
చరాస్తులు: రూ.16,66,24,454
భార్యపై..: రూ.2,06,11,416
స్థిరాస్తులు: రూ.3,48,37,430
భార్యపై..: రూ.4,98,95,500
వాహనాలు: టయోటా(3), హ్యుందయ్, ఇన్నోవా కార్లు

సునీల్ కుమార్ ముత్యాల (కాంగ్రెస్ బాల్కొండ అభ్యర్థి)



చేతిలో నగదు: రూ.1,21,72,979
భార్య దీప్తి వద్ద: రూ.6,33,590
అమ్మ పద్మ వద్ద: రూ.90,000
బ్యాంకులో నిలువ: రూ.48,81,921
భార్య పేరిట: రూ.92,184
బంగారు ఆభరణాలు: రూ.80,25,55,431
భార్యపై నగదు: రూ.94,79,732
తల్లిపై ఉన్న నగదు: రూ.15,90,000
వ్యవసాయ భూములు: 19 ఎకరాల, 17 గుంటలు
తల్లి పేరిట: 5 ఎకరాల 36 గుంటలు
వ్యవసాయేతర భూములు: 8 ఎకరాల, 31 గుంటలు
భూములు: 4,840 గజాలు
తల్లి పేరిట ఉన్న భూమి: రూ.12,06,000
నివాసం: హైదరాబాద్‌లో..

రేకులపల్లి భూపతిరెడ్డి (కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి)



భార్య: వినోదినిరెడ్డి
కుమారుడు: స్నేహిత్‌రెడ్డి
స్థిరాస్తులు: రూ.43కోట్ల10లక్షలు,
చరాస్తులు: రూ.97,76,180
భార్యపై స్థిరాస్తులు: రూ.10కోట్లు,
చరాస్తులు: రూ.77,82,700
కుమారుడిపై స్థిరాస్తులు: రూ.5 కోట్లు, చరాస్తులు రూ.8,53,410
అప్పులు: రూ.1,14,11,289
భార్యపై ఉన్న అప్పులు: రూ.33,79,027
చేతిలో ఉన్న నగదు: రూ.3లక్షల 30వేలు,
భార్య చేతిలో: రూ.2లక్షల22వేలు
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.1,99,027
భార్యఅకౌంట్‌లో..: రూ.45,70,700
కొడుకు వద్ద నగదు: రూ.9వేలు,
బ్యాంకులో: రూ.4,86,930
వాహనాలు: మెర్సిడిస్ బెంజ్
కేసులు: రెండు ఉన్నాయి

వడ్డి మోహన్‌రెడ్డి (బీజేపీ బోధన్ అభ్యర్థి)



భార్య: లక్ష్మి
చేతిలో ఉన్న నగదు: రూ.6,51,546
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.9,16,61,722
భార్య చేతిలో..: రూ.1,95,510
భార్య ఖాతాలో: రూ.3,41,41,175
బంగారం(రూ.లలో): రూ. 33 లక్షలు
అప్పులు: రూ.2,87,49,762
భార్యపై ఉన్న అప్పులు: రూ.1,75,50,331
వ్యవసాయ భూములు: 25 ఎకరాలు
నివాసాలు: హైదరాబాద్, నిజామాబాద్‌లో..
చరాస్తులు: రూ.16,21,63,270
భార్యపై..: రూ.5,81,81,250
వాహనాలు: ఇన్నోవా కారు

వేముల ప్రశాంత్‌రెడ్డి (బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి)



నగదు: రూ.6,79,96,612
భార్య నీరజారెడ్డిపై: రూ.4,77,31,857
కుమారుడు పూజిత్‌రెడ్డిపై: రూ.19,48,523
వ్యవసాయ భూములు: రూ.3 కోట్లు
భార్యపై: రూ.6.55 కోట్లు
స్థిరాస్తుల విలువ: రూ.8 కోట్లు
భార్యపై: రూ.15 కోట్లు
క్రిమినల్ కేసులు: ఎన్నికల కేసు

ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా (బీజేపీ అర్బన్ అభ్యర్థి)



భార్య: మణిమాల
చేతి నగదు: రూ.1.15 లక్షలు
భార్య చేతిలో: రూ.45 వేలు
బ్యాంక్ బ్యాలెన్స్: రూ.32,21,564
భార్యపై: రూ.2,19,436
వాహనాలు: బైక్, స్కార్పియో కారు
బంగారం: 755 గ్రా॥ (రూ. 42 లక్షలు)
వ్యవసాయభూములు, నాన్‌అగ్రికల్చర్ భూములు: ఉన్నాయి
నివాసం: నాందేవ్‌వాడలో..
భార్యపై అప్పు: రూ. 1.96 కోట్లు

కూచిపూడి నృత్యంలో ప్రతిభ



దోమకొండ: హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీలలో దోమకొండకు చెందిన చిన్నారులు ప్రతిభను చూపారు. మండల కేంద్రంలో గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో ఆరు నెలల నుంచి చిన్నారులకు ప్రత్యేకంగా కూచిపూడి నృత్యం నేర్పిస్తున్నారు. 20 మంది చిన్నారులు కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబర్చగా వారికి శిల్పకలా వేదికలో నృత్యం చేసే అవకాశం కల్పించారు. శుక్రవారం శిల్పకళా వేదికలో వీరు కుచిపూడి నృత్యం చేయగా, నిర్వాహకులు అభినందించి బహుమతులు అందజేసినట్లు గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తెలిపారు. ప్రముఖ సినీ నటుడు సుమన్, మ్యూజిక్ డైరెక్టర్లు శివమణి, తమన్, తెలంగాణ సంగీత నాట్య అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి తదితరులు హాజరై వీరిని అభినందించారు.

జానపద నృత్య పోటీల్లో..



కామారెడ్డి టౌన్: విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో గోదావరి ఆడిటోరియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జానపద నృత్య పోటీలలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. పర్యావరణం పరిరక్షణ, కౌమార విద్య అంశాలపై నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థినులు నిశ్చిత, శ్రీ నిర్జర, నందిని, శైలజ, అనూష, నవితలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

మళ్లీ గెలిస్తే మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తా

- బాన్సువాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాన్సువాడ రూరల్: నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, సీఎం కేసీఆర్ అందించిన సహకారంతో బాన్సువాడను ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేశానని బాన్సువాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని బోర్లం, ఇబ్రహీంపేట్, రాంపూర్, కొల్లూర్ తదితర గ్రామాలు, తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలో ఏ నియోజకవర్గంలో లేనన్ని 11 వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు బాన్సువాడకు మంజూరు చేయించానన్నారు. ప్రజల ఆశీర్వదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాగానే మిగిలి ఉన్న పనులన్నీ పూర్తి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నీ అమలు అవుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. కులసంఘాలు మద్దతు లేఖలను ఇవ్వగా, లబ్ధిదారులు, అభిమానులు శాలువాలు, పూలదండలతో సన్మానించారు. మైనార్టీనాయకులు ఇమాం-ఏ-జామి కట్టారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి ఓటేస్తే డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుంది'



రామారెడ్డి (ఎల్లారెడ్డి): కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌కు ఓటేసి గెలిపించినా బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడు పోతాడని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాల భైరవుడికి పూజలు చేసి, ఇసన్నపల్లి, రామారెడ్డి, కన్నాపూర్ తండా, కన్నాపూర్, గొల్లపల్లి గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డిలో వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన సురేందర్ అభివృద్ధి పేరుతో అధికార బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయాడని, ఇప్పుడు తాజాగా అదే కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నుంచి పోటీ చేస్తున్న మదన్ మోహన్‌కు ఓటేస్తే మళ్లీ బీఆర్ఎస్‌కు అమ్ముడుపోవడం ఖాయమన్నారు. బీజేపీ తరఫున తనను గెలిపిస్తే తన సేవా కార్యక్రమాలు కొనసాగించడంతోపాటు డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని, ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు.

'బకాయిలను తక్షణమే విడుదల చేయాలి'

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ కామారెడ్డి జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం శుక్రవారం పట్టణ పరిధిలోని అడ్లూర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పర్వతరెడ్డి మాట్లాడుతూ... గెజిటెడ్ ఉపాధ్యాయులను మల్టీ జోన్‌లో బదిలీలు చేయడంతో జిల్లాలు మారినపుడు పీఎఫ్ చెల్లింపుల్లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రతినిధులు దయానంద్, బాలచంద్రం, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం గ్రామ శివారులో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో నిర్మల్‌జిల్లా మాదాపూర్‌కు చెందిన ఎలాల రాజారెడ్డి(70) అక్కడిక్కడే శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన రాజారెడ్డి తన బైక్‌పై మండలంలోని కోడిచర్ల నుంచి మాదాపూర్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై దూదిగాం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా నిర్మల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో కిందపడ్డ రాజారెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీలో నగదు పట్టివేత



భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ.లక్షా70వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును టాస్క్‌ఫోర్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వర్ని: మండల కేంద్రంలోని మల్లారం గ్రామానికి చెందిన బిక్యా నాయక్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు బాధితుడు తెలిపాడు. మండల కేంద్రంలోని ఒక హోటల్ వద్ద నిలిపిఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితడు తెలిపాడు.

అక్రమ మద్యం పట్టివేత



బాన్సువాడ రూరల్: నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి తెలిపారు. దాడిలో 25లీటర్ల మద్యం, 58లీటర్ల బీర్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.48వేలు ఉంటుందన్నారు. నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై తేజస్విని, హెడ్‌కానిస్టేబుల్ విఠల్, షర్ఫొద్దీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

గాంధారి: మండల పరిధిలోని చద్మల్‌లో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేందీప్ శుక్రవారం తెలిపారు. తనిఖీల్లో మద్యం, రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పటాకుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

ఖలీల్‌వాడి: జిల్లావ్యాప్తంగా పటాకుల దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేకుండా పటాకుల దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే దీపావళి పండుగ రోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల లోపే పటాకులు కాల్చాలని ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

- సాధారణ మరణమని చెప్పిన భార్య
- అంత్యక్రియల సమయంలో మెడ చుట్టూ అచ్చులు గుర్తించిన బంధువులు
- కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన చాకలి గుట్టమీది డాకయ్య(52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలి ఘణపూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన డాకయ్య గతంలో నాగిరెడ్డిపేట గ్రామానికి ఇల్లరికం వచ్చి చాకలి నర్సవ్వను వివాహమాడాడు. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. డాకయ్య గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల తాగిన మత్తులో కిందపడడంతో అతని తలకు గాయ్యాలయ్యాయి. కాగా తన భర్త డాకయ్య గురువారం రాత్రి చనిపోయాడని నర్సవ్వ గ్రామస్తులకు, బంధువులకు తెలియజేసింది. దీంతో అంత్యక్రియల కోసం బంధువులు గ్రామానికి చేరుకున్నారు.

అంత్యక్రియలు నిర్వహించే క్రమంలో డాకయ్య మృతదేహాన్ని చూడగా అతని మెడచుట్టూ నల్లటిమచ్చ ఉండడంతో అనుమానంతో అంత్యక్రియలను అడ్డుకొని నర్సవ్వను నిలదీశారు. దీంతో డాకయ్య గురువారం సాయంత్రం తాను ఇంట్లోలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని నర్సవ్వ చెప్పింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు గ్రామానికి చేరుకొని వివరాలను సేకరించారు. డాకయ్య మరణంపై అనుమానాలు ఉన్నాయని అతని సోదరుడు మాందారి సిద్ధిరాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



వర్ని (చందూర్) : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బేకరీ సాయికుమార్ (22) పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మృతుడు చెడు అలవాట్లకు బానిసై మద్యానికి అలవాటు పడి ఇంట్లో తరచూ గొడవపడేవాడని అన్నారు. ఈ క్రమంలో ఈనెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయికుమార్ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ వెల్లడించారు. భార్య ఉమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండల కేంద్రంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలైనట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. ముదక్‌పల్లికి చెందిన వ్యక్తి తన బైక్‌పై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రోడ్డు దాటుతున్న గొల్ల వీరేశ్‌ను వేగంగా ఢీకొన్నాడు. దీంతో వీరేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరేశ్ కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



ధర్పల్లి : ధర్పల్లి మండలంలోని హొన్నాజీపేట్‌లో చెరువు కట్టపై అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రోల్ల ప్రసాద్(35) చెరువు కట్ట పైనుంచి ట్రాక్టర్ నడుపుతూ వెళ్తుండగా అదుపు తప్పి పల్టీలు కొట్టి పడిపోయింది. ప్రసాద్ పైన ట్రాక్టర్ పడటంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదని, తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందినట్లు పేర్కొన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వే చేయించడం నేరం

ఖలీల్‌వాడి : సర్వే ముసుగులో వ్యతిరేక ఓట్ల ను పార్టీలు గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రైవేట్ ఏజెన్సీలతో ఓటర్ సర్వే చే యించడం నేరమని, దీనిపై బోధన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు సీపీ కల్మేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధ న్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నవారిపై రెండు కేసులను నమోదు చేశామన్నారు. రాజకీయ పార్టీలు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఇంటింటికీ సర్వే చేస్తూ వ్య తిరేక ఓట్లను గుర్తిస్తున్నారని, అనంతరం వా రిని తమకు అనుకూలంగా మార్చుకునేందు కు అనైతిక పద్ధతులను పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా సర్వే అంటూ వస్తే 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.